## పెద్ద చెరువును పరిశీలించిన కలెక్టర్



అమీన్‌పూర్ పెద్ద చెరువును అధికారులతో కలిసి పరిశీలిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

అమీన్‌పూర్, మే 23: అమీన్‌పూర్ పెద్ద చెరువు శిఖం, ఎఫ్‌టీఎస్ బఫర్‌జోన్‌లకు సంబంధించి రిపోర్టులను వెంటనే సమర్పించాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి నీటిపారు శాఖ అధికారులను ఆదేశించారు. గురువారం అమీన్‌పూర్ పెద్ద చెరువును స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, మున్సిపల్ అధికారులు, నీటి పారుదల శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా చెరువు తూముల నుంచి నీరు కిందికి వెళ్లే కాల్వలను పరిశీలించారు. చెరువు తుములకు సంబంధించి మ్యాపులను, నీరు కిందికి వెళ్లే మార్గాలను, తూముల వివరాలను అధికారులు కలెక్టర్‌కి మ్యాప్ ద్వారా వివరించారు. చెరువుకు సంబంధించిన ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లకు సంబంధించిన రిపోర్టులను అందజేయాలని ఇరిగేషన్ శాఖ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, కమిషనర్ జ్యోతి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

సంగారెడ్డి కలెక్టరేట్, మే 23: ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు జిల్లాలో ఏర్పాటు చేసిన 31 పరీక్షా కేంద్రాల్లో 14,886 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. అన్ని కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించారు. 144 సెక్షన్ అమలు చేయనున్నారు. పరీక్షా కేంద్రాల పరిసరాల్లో జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని ఆదేశించారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు ఫస్టియర్, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 వరకు సెకెండియర్ పరీక్షలు జరగనున్నాయి.

## మెరుగైన వైద్యం అందించాలి



జోగిపేట ప్రభుత్వ దవాఖానలో మాట్లాడుతున్న డీసీహెచ్ సంగారెడ్డి

అందోల్, మే 23: దవాఖానకు వచ్చే వారికి మెరుగైన వైద్యం అదించడంతోపాటు వారికి కావాల్సిన సౌకర్యాలు కల్పించాలని డీసీహెచ్ సంగారెడ్డి అన్నారు. గురువారం జోగిపేట ప్రభుత్వ దవాఖానను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దవాఖానలో వసతులను పరిశీలించారు. ఇటీవల పలు ప్రభుత్వ దవాఖానల్లో కరెంట్ సమస్య ఉత్పన్నమవుతున్న నేపథ్యంలో సిబ్బందితో మాట్లాడి కరెంట్ సమస్య ఏమైనా ఉందా అని అడిగి తెలుసుకున్నారు. నూతనంగా ఏర్పాటు చేసిన జనరేటర్ పనితీరును పరిశీలించారు. అనంతరం వైద్యులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. వైద్యులు, సిబ్బంది ఎప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. అన్ని రకాల మందులు, వైద్య పరీక్షలు అందుబాటులో ఉన్నాయని ప్రజలు ప్రభుత్వ దవాఖానలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. సూపరింటెండెంట్ డాక్టర్ రమేశ్, సిబ్బంది ఉన్నారు.

## వేగంగా ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

జిన్నారం, మే 23: మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సివిల్ సప్లై అధికారులు గురువారం పరిశీలించారు. సివిల్ సప్లై డీఎం కొండల్‌రావు, డీటీ తేజస్విని తహసీల్దార్ భిక్షపతితో కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకువచ్చిన రైతులతో మాట్లాడారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రానికి రైతులు తీసుకువచ్చే ధాన్యాన్ని వెంటవెంటనే తీసుకోవాలని, బస్తాల్లో నింపి సంబంధిత రైస్ మిల్లులకు పంపించాలని సిబ్బందికి సూచించారు. కొనుగోలు కేంద్రానికి వచ్చే అన్ని రకాల ధాన్యాన్ని సేకరించాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం నరేందర్, వీవో సుజాత తదితరులు పాల్గొన్నారు.

## భక్తులతో కిటకిటలాడిన బోరంచ



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

మనూరు, మే 23: మనూరు మండల పరిధిలోని బోరం చ నల్ల పోచమ్మ ఆలయ ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఏడు వారాల జాతరలో భాగంగా గురువారం భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. మహిళా భక్తులు బోనాలతో ప్రదక్షినలు చేశారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి ఒడి బియ్యం సమర్పించారు. నారాయణఖేడ్ ఆర్టీసీ మార్కెట్ సెల్ మేనేజర్ పాండు ఆలయంలో ప్రత్యేక పూజ లు చేశారు. నారాయణఖేడ్ నుంచి ప్రత్యేక బస్సులు నడిపేలా కృషి చేస్తానన్నారు.

## యథేచ్ఛగా మట్టి తవ్వకాలు



ర్యాగడికుంటలో మట్టి తవ్వకాలు చేయడంతో ఏర్పడిన గుంత

గుమ్మడిదల, మే 23: నల్లవల్లి పంచాయతీ పరిధిలోని ర్యాగడికుంటలో అక్రమంగా మట్టి తవ్వకాలు చేస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొద్ది రోజులుగా ఎర్రచెరువు సమీపంలోని ర్యాగడికుంటలో జేసీబీలతో తవ్వకాలు చేపట్టి భారీ గుంతలు చేస్తున్నారని రైతు చాపల మధు ఆరోపించారు. గ్రామ సమీపంలో ఫాంలాండ్ ఏర్పాటు చేస్తూ ఆ భూములను చదును చేసేందుకు ఎలాంటి అనుమతులు లేకుండా జేసీబీలతో మట్టి తవ్వకాలు జరుపుతున్నారన్నారు. ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు స్పందించి కుంటను రక్షించాలని కోరారు.

## చిన్నారి వైద్యానికి ఆర్థికసాయం



చిన్నారిని దవాఖానకు తరలిస్తున్న సంఘ సేవకుడు ఆనంద్ కృష్ణారెడ్డి

బొల్లారం, మే 23: బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని బాలాజీనగర్‌లో నివసించే బీహార్ రాష్ట్రానికి చెందిన సంజయ్ శర్మ కూతురు (9) గురువారం ప్రమాదవశాత్తు గాయపడింది. తల్లి వంట చేసి పనికి వెళ్లింది. ఈలోగా పాపకు ఆకలి వేయగా అన్నం వడ్డించుకొని పప్పు వేసుకుంటుండగా ఒంటిపై పడడంతో వేడికి తీవ్ర గాయాలయ్యాయి. పాపకు వైద్యం చేయించే స్థితిలో కుటుంబం లేకపోవడంతో స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న సంఘ సేవకుడు ఆనంద కృష్ణారెడ్డి అండగా నిలిచారు. అంబులెన్స్‌కు ఫోన్ చేసి గాంధీ దవాఖానకు తరలించారు. పాప వైద్య ఖర్చుల నిమిత్తం రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు.

# వానకాలానికి 'సాగు'దాం

- విత్తన కొనుగోలులో తస్మాత్ జాగ్రత్త
- అప్రమత్తతే శ్రీరామరక్ష
- వేసవి దుక్కులతో పొలాలను సిద్ధం చేసుకుంటున్న రైతులు



న్యాల్‌కల్‌లో పొలాన్ని ట్రాక్టర్‌తో దున్నుతున్న రైతు

న్యాల్‌కల్, మే 23: వానకాలం సాగుకు సమయం దగ్గర పడుతున్నది. రైతులు వేసవి దుక్కులు చేసుకొని పొలాలను సాగుకు సిద్ధం చేస్తున్నారు. వానకాలం సీజన్‌లో వరి, పత్తి, కంది, సోయాబీన్, పెసర, మినుము తదితర పంట ల సాగు వైపు రైతులు దృష్టి సారిస్తున్నారు. వ్యవసాయ శాఖ నుంచి సబ్సిడీతో విత్తనాలు అందిస్తున్నా కొంతమంది రైతులు ప్రైవేటులో కొనేందుకు మొగ్గుచూపుతున్నారు. గతంలో అనేక చోట్ల నకిలీ విత్తనాలు కొని ఆర్థికంగా నష్టపోయిన రైతులు ఎందరో ఉన్నారు. ఈ నేపథ్యంలో రైతులు తగు జాగ్రత్తలు తీసుకుంటే మంచిదని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

**విత్తనాల కొనుగోలులో..**

వ్యవసాయ శాఖ ద్వారా లైసెన్స్ పొందిన అధీకృత డీలర్ నుంచి మాత్రమే విత్తనాలను కొనుగోలు చేయాలి. విత్తనాలు కొన్న సమయంలో బిల్లులో విత్తన రకం నంబర్, గడువు తేదీ, కొనుగోలు తేదీ, డీలర్ సంతకం, రైతు సంతకం బిల్లులో ఉండేవిధంగా చూసుకోవాలి. లూజుగా ఉన్న సంచులు, పగిలిన ప్యాకెట్లు, తెరిచిన డబ్బాలు, గడువు దాటిన విత్తనాలను కొనుగోలు చేయవద్దు. బిల్లులో విక్రయదారుని పేరు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అమ్మకపు నంబర్, విత్తనాల ప్యాకెట్, డబ్బా, సంచులకు సీలు ఉందా లేదా నిర్ధారించుకోవాలి, విక్రయదారుడు ఇచ్చే కరపత్రాలను తీసుకొని వాటిలో పేర్కొన్న అంశాలను సరిచూసుకోవాలి. విత్తనాలు కొనుగోలు చేసిన బిల్లును పంటకాలం పూర్తయ్యే వరకు జాగ్రత్తగా దాచి పెట్టుకోవాలి. నాటిన విత్తనాలు మొలకెత్తకపోవడం, పూత దశలో లోపాలు కనిపిస్తే వెంటనే వ్యవసాయాధికారులను సంప్రదించాలి

**ఎరువుల కొనుగోలులో..**

లైసెన్సు ఉన్న డీలర్ వద్దనే ఎరువులను కొనుగోలు చేయాలి. బిల్లును పంటకాలం పూర్తయ్యే వరకూ జాగ్రతగా దాచి పెట్టుకోవాలి. ఎరువుల సంచులు మిషన్ కుట్టుతో ఉన్న వాటిని కొనుగోలు చేయాలి. చేతితో కట్టిన వాటిని కొనుగోలు చేయరాదు. ఎరువుల ప్రామాణిక పోషకాల వివరాలు, ఉత్పత్తి సంస్థ పేరు, ఉత్పత్తిదారుని పేరు ఉందా లేదా అని సరిచూసుకోవాలి. ఎరువుల నాణ్యతపై అనుమానం వస్తే ఎరువులను వ్యవసాయాధికారులకు చూపించి పరీక్షకు పంపాలి. అన్య పదార్థలు కనిపిస్తే కల్తీలుగా గుర్తించాలి.

**పురుగు మందుల కొనుగోలులో..**

పంట ఎదుగుతున్న దశలో పంటకు ఆశించే చీడపీడల నివారణకు వాడే క్రిమిసంహారక మందుల కొనుగోలులో రైతులు గతు జాగ్రతాలు పాటించాలి. వ్యవసాయ, ఉద్యానవన, శాస్త్రవేత్తలు సూచించిన మందులను మాత్రమే కొనుగోలు చేయాలి. అవసరానికి మించి మందులను కొనుగోలు చేయరాదు. పురుగు మందుల డబ్బాలపై వజ్రాకారంలో పురుగుల మందు స్థాయిని తెలిపే రంగులు ఉంటాయి. అత్యంత విషపూరితమైతే నీలం రంగు, స్వల్ప విష పూరితమైతే అకుపచ్చ రంగు గుర్తులు ఉంటాయి. పంటకు అశించిన చీడ పురుగులను నివారించేందకు రెండు, మూడు రకాలు కలిపి వాడరాదు. వాడిన డబ్బాలు, సీసాలను ఖాళీ అయిన తర్వాత ధ్వంసం చేయాలి, లేదా గుంతలో పూడ్చి వేయాలి.

### జాగ్రత్తలు పాటించాలి



వ్యవసాయ శాఖ నుంచి అనుమతి పొందిన దుకాణాల్లోనే రైతులు విత్తనాలు, ఎరువులు, మందులను కొనుగోలు చేయాలి. ప్రభుత్వంతో ఒప్పదం కుదర్చుకున్న సంస్థల నుంచి సర్టిఫైడ్ అయిన వాటినే ఎంచుకోవాలి. కొనుగోలు చేసిన విత్తనాలు, ఎరువులు, మందులకు సంబంధించిన బిల్లులను తప్పనిసరిగా తీసుకొని పంటకాలం పూర్తయ్యే వరకు భద్రపరుచుకోవాలి. సంచులు, డబ్బాలపై ఉత్పత్తి, విక్రయదారుడి పేరు, చిరునామా లాట్ నంబర్ పరీక్షించుకోవాలి. విత్తనాల మొలక శాతాన్ని పరీక్షించుకోవాలి. సాగులో ఏమైనా సమస్యలుంటే వ్యవసాయాధికారులు, విస్తరణ అధికారులకు సంప్రదించాలి.

**- లావణ్య, న్యాల్‌కల్ మండల వ్యవసాయాధికారి**

## తల్లిదండ్రుల చెంతకు బాలిక




బాలికను తండ్రికి అప్పగిస్తున్న పోలీసులు

రామచంద్రాపురం, మే 23: ఇంటి నుంచి తప్పిపోయి ఎటు వెళ్లాలో తెలియని ఓ బాలికకు కొల్లూర్ పోలీసులు ఆశ్రయం కల్పించారు. ఇన్‌స్పెక్టర్ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. తెల్లాపూర్ మున్సిపాలిటీ కొల్లూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం రాత్రి ఓ బాలిక ఇంటి నుంచి తప్పిపోయి కొల్లూర్‌లోని డబుల్ బెడ్రూం ఇండ్ల సముదాయం వద్ద తిరుగుతూ కనిపించిన బాలికను గమనించిన ఓ దుకాణదారుడు 100కు కాల్ చేసి సమాచారం ఇచ్చాడు. దీంతో పోలీసులు అక్కడికి చేరుకొని బాలికను పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు. ఆ బాలిక నుంచి సరైన సమాధానం రాకపోవడంతో పోలీసులు బాలికను బీరంగూడలోని స్పెర్డ్స్ హోమ్‌కి తరలించారు. బాలిక తల్లిదండ్రులు యూపీకి చెందిన వారు, తెల్లాపూర్‌లోని ఓ నిర్మాణ సంస్థలో కూలీలుగా పనిచేస్తున్నారు. బుధవారం రాత్రి బాలిక తల్లి ఇంట్లో వంట చేస్తున్న సమయంలో తప్పిపోయింది. రాత్రంతా బాలిక కోసం వెతికిన తల్లిదండ్రులు గురువారం ఉదయం కొల్లూర్ పోలీస్‌స్టేషన్‌కి వచ్చి ఫిర్యాదు చేయడంతో వారిని స్పెర్డ్స్ హోమ్‌కి తీసుకువెళ్లి తండ్రికి బాలికను అప్పగించారు.

## తలసేమియా చిన్నారుల కోసం రక్తదానం



రక్తదానం చేస్తున్న యువకులు

పటాన్‌చెరు, మే 23: తలసేమియాతో చికిత్స పొందుతున్న చిన్నారులను కాపాడేందుకు బీడీఎల్ విన్నర్స్ ఫౌండేషన్ రక్తదాన శిబిరం ఏర్పాటు చేసింది. గురువారం పటాన్చెరు మండలం బీడీఎల్ భానూర్ కమ్యూనిటీ హాలులో తలసేమియా చిన్నారులకోసం ఏర్పాటు చేసిన అత్యవసర రక్తదాన శిబిరాన్ని బీడీఎల్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాసరావు, ఇండియన్ రెడ్ క్రాస్ సొసటీ మెడికల్ టీం సభ్యులతో కలసి ప్రారంభించారు. ఈ శిబిరంలో 74 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ రోజూ 50మందికి పైగా తలసేమియా చిన్నారుల కోసం రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్ విద్యానగర్‌కు వస్తుంటారని తెలిపారు. ఉద్యోగులు, యువకులు, కార్మికులు విరివిగా రక్తదానం చేస్తేనే తలసేమియాతో బాధపడుతున్న చిన్నారులను కాపాడుకోగలం అన్నారు. విన్నర్స్ ఫౌండేషన్ సేవా కార్యక్రమాలు, బీడీఎల్ ఉద్యోగుల సహకారం కొనియాడదగిందన్నారు. బీడీఎల్ ఎంప్లాయిస్ అవసరమైన ప్రతి సందర్భంలో రక్తదానం చేస్తూ ఆదర్శంగా ఉంటున్నారన్నారు. విన్నర్స్ ఫౌండేషన్ పిలుపు మేరకు ఎంప్లాయిస్‌తో పాటు అప్రంటిస్ చేస్తున్న యువకులు, సమీప గ్రామాల ప్రజలు రక్తదానం చేస్తున్నారన్నారు. రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ రఘు అరికపూడి, జీవరత్నం, యాదగిరిగౌడ్, కాంబ్లీ, రమేశ్, సదానందం, రమేశ్, మల్లేశ్, జయపాల్, శ్రీకాంత్, సృజన్, నాయుడు, కామేశ్ పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోండి



మున్సిపల్ కమిషనర్ మంగతాయారుకు వినతిపత్రం ఇస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

బొల్లారం, మే 23: మున్సిపాలిటీ పరిధిలోని కుడికుంట శిఖంలో అక్రమ నిర్మాణాలపై కలెక్టరేట్‌లో గురువారం ఫిర్యాదు చేసినట్లు బీఆర్‌ఎస్ మున్సిపల్ యువత నాయకులు తిరుపతి రెడ్డి, ఉదయ్ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సర్వే నంబర్ 132లోని కుడికుంట శిఖంలో అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు జైపాల్ రెడ్డి, లక్ష్మారెడ్డి అనుమతులు లేకుండా షెడ్ల నిర్మాణం చేపట్టడమే కాకుండా పరిశ్రమలకు లీజుకిచ్చి సొమ్ము చేసుకుంటున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. 135, 136 సర్వే నంబర్లలో గ్రామ పంచాయతీ అనుమతులతో వెంచర్ ప్రారంభించి ఇళ్ల నిర్మాణం చేపట్టకుండా, 15 నుంచి 20 వరకు ఎలాంటి అనుమతులు లేకుండా షెడ్లు నిర్మించారని అధికారులకు ఫిర్యాదు చేస్తే చర్యలు శూన్యమని ఆరోపించారు. ఉన్నతాధికారులు వెంటనే అక్రమ నిర్మాణాలు చేపట్టిన స్థలాన్ని పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరారు. శిఖం భూముల్లో అక్రమంగా నిర్మించిన షెడ్లను తొలిగించాలని కోరుతూ బొల్లారం మున్సిపల్ కమిషనర్ మంగతాయారును వినతిపత్రం అందజేశారు.

## విద్యార్థులకు పర్యావరణంపై పోటీలు

సంగారెడ్డి కలెక్టరేట్, మే 23: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, జిల్లా పరిషత్, మోడల్ స్కూల్, కేజీబీవీ, ఎయిడెడ్ , అన్ని రకాల గురుకుల పాఠశాలల విద్యార్థులకు ఆన్‌లైన్‌లో పోటీలు నిర్వహించనున్నట్టు జిల్లా విద్యాధికారి ఎస్.వెంకటేశ్వర్లు, జిల్లా కాలుష్య నియంత్రణ మండలి అధికారి గీత గురువారం ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరంలో 6 నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులకు ఆన్‌లైన్ పోటీలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. పర్యావరణంపై కాలుష్య ప్రభావం అనే అంశంపై పెయింటింగ్ పోటీలు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల కలిగే అనార్థాలు, వాటికి ప్రత్యామ్నాయాలు అనే అంశంపై వ్యాసరచన పోటీలు ఉంటాయని తెలిపారు. ఈ నెల 27లోగా విద్యార్థులు ఎంట్రీలను ఎన్‌జీసీ జిల్లా సమన్వయ కర్త మాధవరెడ్డికి (7013239736) వాట్సాప్ ద్వారా పంపాలన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రం, బహుమతులు అందిస్తామని తెలిపారు. విద్యార్థి పంపే పేపర్‌పై విద్యార్థి పేరు, తరగతి, పాఠశాల పేరు, మండలం, ఫోన్ నంబర్ రాసి ఫొటో తీసి పంపించాలన్నారు.

## ఘనంగా బుద్ధ జయంతి



బుద్ధ జయంతిలో నాయకులు

సంగారెడ్డి, మే 23: బుద్ధుని జయంతిని గురువారం పట్టణంలోని అంబేద్కర్ స్టడీ సర్కిల్‌లో డైరెక్టర్ రామారావు, కృష్ణకుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సమస్త మానవాళికి బుద్ధుని ప్రవచనాలు ఆదర్శం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అంబేద్కర్ స్టడీ సర్కిల్ సభ్యులు కోటయ్య, మొగులయ్య, మాణయ్య, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు దుర్గాప్రసాద్, నాయకులు అనంతయ్య, రాంచందర్, రాహుల్, పురుషోత్తం, విజయ్, రాజేశ్, ప్రభాకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

## వైద్య శిబిరాల ఏర్పాటు అభినందనీయం

అమీన్‌పూర్, మే 23: పేదల కోసం ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి అన్నారు. అమీన్‌పూర్ మాజీ సర్పంచ్ దివంగత కాట దర్శన్‌గౌడ్ ఆరో వర్ధంతి సందర్భంగా ఆయన కుమారుడు కాటా రాజుగౌడ్ ఆధ్వర్యంలో మున్సిపల్ పరిధిలోని పెద్ద చెరువు సమీపంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అమీన్‌పూర్ పంచాయతీ అభివృద్ధిలో దర్శన్ గౌడ్ సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ కృష్ణ, బోయిని బాలమణి బాలరాజు, కొల్లూరు చంద్రకళ గోపాల్, కోఆప్షన్ సభ్యుడు తలారి రాములు, నాయకులు కల్లూరి యాదగిరి, టకూరి మహిపాల్ రెడ్డి, టకూరి సురేందర్ రెడ్డి పాల్గొన్నారు.

## వేలాడుతున్న మృత్యు తీగలు



రైతుల పొలాల వద్ద ప్రమాదకరంగా కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలు

ఝరాసంగం, మే 23: మండల పరిధిలోని బర్దిపూర్ శివారులో సర్వేనెంబర్ 135లో రైతులు అంజయ్య, మోహన్, షేకామద్‌ల పొలాల వద్ద విద్యుత్ తీగలు ప్రమాదకరంగా మారాయి. నిమ్జ్‌కు ప్రధాన రహదారి నిర్మణంలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా నిమ్జ్ అధికారులు, కాంట్రాక్టర్లు హుగ్గెల్లి నుంచి బర్దిపూర్ గ్రామ శివారు వరకు అవసరమున్న చోట విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు. కానీ రైతుల పొలాల వద్ద స్తంభాలు ఏర్పాటు చేయకపోవడంతో తీగలు ఇలా ప్రమాదకరంగా కిందికి వేలాడుతున్నాయి. పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని రైతులు వాపోయారు. ఇప్పటికైనా సమస్యను గుర్తించి పరిష్కరించాలని కోరుతున్నారు.

## విద్యుత్ తీగ తగిలి వ్యక్తి మృతి

ఝరాసంగం, మే 23: విద్యుత్ తీగ తగిలి వ్యక్తి మృతి చెందిన ఘటన ఝరాసంగం మండల కేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానిక ఎస్ఐ రాజేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ఝరాసంగం మండల కేంద్రానికి చెందిన వంశరాజు అంతయ్య(56), బుధవారం మేకలు మేపుటకు అడవికి వెళ్లాడు. తిరిగి సాయంత్రం ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతకగా డాక్టర్ పాషా పొలం వద్ద కిందికి వేలాడుతున్న 11కేవీ విద్యుత్ తీగలు తగిలి షాక్‌కి గురై మృతిచెందాడు. మృతుడి కుమారుడు వంశరాజు సుధాకార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఎస్ఆర్ మూవీ జంక్షన్ ఆవిష్కరణ



ఎస్ఆర్ మూవీ జంక్షన్ లోగోను ఆవిష్కరిస్తున్న నటుడు మురళీమోహన్

సంగారెడ్డి, మే 23: పల్లెటూరు నుంచి కొరియోగ్రాఫర్‌గా ఎదిగి ఎస్ఆర్ మూవీ జంక్షన్ ప్రారంభించడం గొప్ప విషయమని నటుడు, ప్రముఖ వ్యాపారవేత్త మురళీమోహన్ అన్నారు. గురువారం హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్‌లో సంగారెడ్డి మండలం ఫసల్‌వాదీ గ్రామానికి చెందిన యువకుడు, కొరియోగ్రాఫర్ సతీశ్‌రాజ్ సొంతంగా మూవీ జంక్షన్ ఏర్పాటు చేసి ప్రారంభ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మురళీమోహన్, ఉమ్మడి జిల్లా డీసీసీబీ వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం జ్యోతిప్రజ్వలన చేసి జంక్షన్‌ను లాంఛనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మురళీమోహన్ మాట్లాడుతూ ప్రతి వ్యక్తిలో ఒక నైపుణ్యం దాగి ఉంటుందని, వెలికి తీసినపుడే సమాజంలో గౌరవం దక్కుతుందన్నారు. కార్యక్రమంలో కొరియోగ్రాఫర్ శేఖర్ మాస్టర్, విజయ్ బిన్నీ మాస్టర్, ఫిలిం చాంబర్ కార్యదర్శి దామోదర్ ప్రసాద్, సంగీత దర్శకుడు చరణ్ అర్జున్, దర్శకుడు చంద్రమహేశ్, నటులు కాదంబరి కిరణ్, వినోద్ బాల, హీరోయిన్ శిరీష, నిర్మాత అర్చన, పలువురు కొరియోగ్రాఫర్లు తదితరులు పాల్గొన్నారు.

## వ్యక్తి మృతదేహం లభ్యం

రాయికోడ్, మే 23: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైందని ఎస్ఐ వెంకట్ రెడ్డి తెలిపారు. గురువారం మండల పరిధిలోని సీరూర్ శివారులోని మంజీర నదిలో ఉదయం మత్స్యకార్మికులు నదిలో మృతదేహం ఉన్నట్లు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్ఐ మృతుడి వయస్సు 35 నుంచి 45 ఏండ్ల మధ్య ఉంటుందని చెప్పారు. మృతదేహం కుళ్లిపోవడంతో పంచానామ నిర్వహించి పూడ్చిపెట్టారు. రెవెన్యూ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కంపు కొడుతున్న కాలనీ



జ్యోతినగర్‌లో అధ్వానంగా ఓపెన్ డ్రైన్, చెత్తాచెదారంతో నిండిన రోడ్డు

రామచంద్రాపురం, మే 23: కొద్ది రోజులుగా పారిశుధ్య సమస్యతో ఇబ్బందిపడుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని జ్యోతినగర్ కాలనీవాసులు మొరపెట్టుకుంటున్నారు. ఓపెన్ డ్రైన్‌లు నిండి మురుగు నీరు ఇండ్ల ముందుకు వచ్చి చేరడంతో తీవ్ర దుర్వాసన వస్తుందని 'నమస్తేతెలంగాణ' దృష్టికి తీసుకువచ్చారు. చెత్తాచెదారంతో డ్రైనేజీ నిండడంతో మురుగు నీరు రోడ్ల మీదకు వస్తున్నదని, దోమలు, దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. వర్షాలు కురుస్తుండడంతో మురుగు సమస్య తీవ్రమవుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ సురేశ్ దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు.

## పెండింగ్ వేతనాలివ్వాలి

సంగారెడ్డి, మే 23: జిల్లాలో ప్రభుత్వ దవాఖానలో పని చేస్తున్న ఎన్‌హెచ్‌ఎమ్ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న మూడు నెలల వేతనాలు విడుదల చేయాలని అధికారులను కోరారు. గురువారం స్థానిక ప్రభుత్వ దవాఖానలో డీఎంహెచ్‌ఓ ఏఓ శ్రీహరికి సీఐటీయూ ఆధ్వర్యంలో ఉద్యోగులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మెడికల్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి యాదగిరి మాట్లాడుతూ ఎన్‌హెచ్‌ఎమ్ పరిధిలో పనిచేస్తున్న ఏఎన్ఎం, స్టాఫ్ నర్స్, ల్యాబ్ టెక్నీషియన్లకు రాష్ట్ర ప్రభుత్వం 3 నెలలుగా బకాయి వేతనాలు ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదన్నారు. ఉద్యోగులందరికీ మూడు నెలల వేతనాలు 7 నెలల పీఆర్సీ ఎరియర్స్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 2018లో 510 జీఓలో నష్టపోయిన నాలుగు వేల కుటుంబాలకు న్యాయం చేయాలని, ఎన్‌హెచ్‌ఎమ్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందరికీ ప్రతినెల 5వ తేదీలోపు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

## అక్రమ రోడ్డు తొలిగింపు

బొల్లారం, మే 23: బొల్లారం పారిశ్రామిక వాడలోని సర్వే నంబర్ 81, 84లో ఇండస్ట్రియల్ ఎన్‌రిచ్ పార్కు జోన్‌లో అక్రమంగా రోడ్డు నిర్మాణాలు చేపడుతున్నారని స్థానికుల నుంచి వచ్చిన ఫిర్యాదులపై మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు స్పందించి చర్యలు చేపట్టారు. గురువారం పార్కులో అక్రమంగా వేసిన రోడ్డును జేసీబీ సహాయంతో తొలిగించారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి రోడ్డు నిర్మాణాలు, ఇతర ఏ నిర్మాణాలు చేపట్టినా కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి పవన్ హెచ్చరించారు. కార్యక్రమంలో అధికారి నవీన్, స్థానికులు పాల్గొన్నారు.

## జనుము విత్తనాల పంపిణీ

ఝరాసంగం, మే 23: సబ్సిడీపై జనుము విత్తనాలను పంపిణీ చేస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి వెంకటేశం తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని ఆగ్రో రైతు సేవ కేంద్రంలో పట్టాదార్ పాస్ పుస్తకంతోపాటు ఆధార్ కార్డు తీసుకొని వచ్చిన రైతులకు జనుము విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ.. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండలానికి మొత్తం 100 క్వింటాల విత్తనాలు వచ్చినట్లు తెలిపారు.

## బటర్‌ప్లై లైట్లు ఏర్పాటు చేయాలి



వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

రామచంద్రాపురం, మే 23: తెల్లాపూర్‌లోని రేడియల్ రోడ్డు 7లో బటర్‌ప్లై లైట్లను వెంటనే ఏర్పాటు చేయించాలని బీజేపీ కౌన్సిలర్ శంషాబాద్ రాజు, కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి మున్సిపల్ అధికారులను కోరారు. గురువారం మున్సిపల్ మేనేజర్ యాదగిరిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నల్లగండ్ల నుంచి తెల్లాపూర్ ఛత్రపతి శివాజీ సర్కిల్, హైహోమ్ అంకుర మీదుగా నాగులపల్లి వరకు బటర్‌ప్లై లైట్లను ఏర్పాటు చేయాలన్నారు. లైట్లు లేకపోవడంతో రాత్రి సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. నాయకులు మాణిక్‌రెడ్డి, రాజిరెడ్డి తదితరులున్నారు.

## వీరభద్రస్వామి ఆలయంలో చండీ హోమం

గుమ్మడిదల, మే 23: ప్రసిద్ధ శైవక్షేత్రమైన బొంతపల్లి భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలో భక్తిశ్రద్ధలతో చండీహోమాన్ని నిర్వహించారు. గురువారం పౌర్ణమిని పురస్కరించుకొని మండలంలోని వీరన్నగూడెంలో వీరభద్రస్వామి ఆలయంలో అర్చకబృందం చండీహోమాన్ని నిర్వహించారు. ఆలయ ధర్మదాయ శాఖ సీనియర్ అసిస్టెంట్ రవీంద్రమూర్తి ఆధ్వర్యంలో చండీహోమాన్ని నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు.

**బహిరంగ ప్రకటన**

ఇందుమూలంగా సాధారణ ప్రజలకు తెలియజేయునది ఏమనగా, నా క్లయింటు శ్రీ సార నాగరాజు తండ్రి ఎస్. సత్యనారాయణ, వయస్సు సుమారు 45 సం.లు, వృత్తి : ప్రభుత్వ ఉద్యోగి, నివాసం : ఇం.నం. 10-76/1, ఇస్మాయిల్‌ఖాన్‌పేట్ గ్రామం, సంగారెడ్డి మండలం, సంగారెడ్డి జిల్లా గారు, SRO, సంగారెడ్డి రికార్డులలో నమోదుకాబడిన డాక్యుమెంటు నం. 10038/2010 తేది: 30.10.2010 ప్రకారం సంగారెడ్డి జిల్లా, సంగారెడ్డి మండలం, ఇస్మాయిల్‌ఖాన్‌పేట్ గ్రామం వద్ద గల సర్వే నం. 445/E/1 నందుగల ఆస్తి, సరిహద్దులు: (ఉ): పొరుగువారి భూమి, (ద): భానూరి లింగరాజు భూమి, (తూ): రోడ్, (ప): సార లక్ష్మణ్ భూమి గల ఆస్తి యొక్క యజమాని మరియు అతను 20.05.2024న జహీరాబాద్ నుండి ఎస్‌బిఐ రీజినల్ ఆఫీస్, కూకట్‌పల్లి, హైదరాబాద్‌కు వెళ్లేందుకు సిద్ధమై, బస్ ఎక్కేందుకు జహీరాబాద్ బస్టాండ్‌కు వెళ్లారు, ఈ క్రమంలో అతని బ్యాగ్ ఎక్కడో పడిపోయినదని అతను గ్రహించారు, ఆ బ్యాగ్‌లో ఒరిజినల్ సేల్ డీడ్ డాక్యుమెంటు నం. 10038/2010 మరియు ఒరిజినల్ పట్టాదారు పాస్‌బుక్ నం. T0 923091268, ఖాతా నం. 60178, ఒరిజినల్ తహశీల్దార్, సంగారెడ్డి మండలం పొసీడింగ్స్ నం. B/1667/2013 & ఒరిజినల్ తహశీల్దార్, సంగారెడ్డి పొసీడింగ్స్ నం. B/7409/2015 గలవి ఉన్నవి. కావునా పోయినటువంటి బ్యాగ్‌లో పై ఒరిజినల్ డాక్యుమెంట్లు ఉన్నవని నా క్లయింటు ద్వారా నేను ఇందుమూలంగా తెలియజేస్తున్నాను మరియు ఎవరికైనా సదరు డాక్యుమెంట్లు దొరికితే, ఈ ప్రకటన ప్రచురణ తేదీ నుండి ఒక వారంలోగా వెంటనే దిగువ సంతకందారును సంప్రదించాలని ప్రతీ ఒక్కరిని కోరడమైనది. ఎటువంటి సమాచారం అందని పక్షంలో సదరు డాక్యుమెంటు శాశ్వతంగా పోయినదని భావించి, డాక్యుమెంటు తిరిగి పొందడం కోసం తగిన న్యాయపరమైన చర్యలు చేపట్టడం జరుగుతుంది.

సం/- **రవి శంకర్ గొట్టిముక్కుల**, న్యాయవాది
ఇం.నం. 1-68/2, 1వ అంతస్తు, ప్రభాత్‌నగర్, ఆర్చిడ్ హాస్పిటల్స్ లేన్, చైతన్యపురి, హైదరాబాద్-500060, మొబైల్ : +91-9182959621